సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం । 2 । జూన్ । 2025



స్ఫూర్తినిచ్చి.. ఆర్తి మిగిల్చి..

ప్రముఖ సాహితీవేత్త, తెలుగు భాషా సంస్కృతులు, స్త్రీ హక్కుల పరిరక్షణకు అలుపెరుగని పోరాటం చేసిన డాక్టర్ పి.చిరంజీవిని కుమారి తుది శ్వాస విడిచారు.


8లో



భక్తులతో పోటెత్తిన రత్నగిరి

రత్నగిరి వాసుడు సత్యదేవుని ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు..

ఖరీఫ్‌కు నీరు విడుదల



ఖరీఫ్ సాగుకు సంబంధించి ధవళేశ్వరంలోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం నీటిని విడుదల చేశారు. తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా కాలువలకు మొత్తం 500 క్యూసెక్కుల నీటిని వదిలారు.

అంతంత మాత్రం

- వైద్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్న నేటి పాలకులు
- ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇచ్చిన నాటి సీఎం జగన్
- ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచిన ఘనత గత ప్రభుత్వానిది
- జగనన్న ఆరోగ్య రక్షతో ఇంటింటికీ వైద్యం
- తరచూ వైద్య శిబిరాలతో ప్రజల చెంతకు సేవలు

గ్రౌండ్ రిపోర్ట్ — సాక్షి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజారోగ్యాన్ని పట్టించుకోవడం లేదు. రోగులకు ఆసరాగా నిలబడి మానసిక స్థైర్యాన్ని ఇచ్చే బాధ్యత నుంచి ఈ ప్రభుత్వం తప్పుకొంది అనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతిష్ఠాత్మకంగా అమలు అయిన ఆరోగ్యశ్రీని ఎన్టీఆర్ వైద్య సేవగా మార్పు చేసి పైకి అమలు చేస్తున్నట్లు చెబుతూనే ఆ పథకాన్ని నిర్వీర్యం చేస్తోంది. జిల్లాలో 46 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉన్నా వాటి ద్వారా రోగులకు అందే వైద్యం అంతంత మాత్రమే. ఆరోగ్యశ్రీ బిల్లులు ఆస్పత్రులకు చెల్లించే అంశంలో పాలకులు అంతులేని అలక్ష్యం చూపుతున్నారు.

అమలాపురం టౌన్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైద్యానికి పెద్ద పీట వేసింది. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ కుటుంబమైనా ఆనందంగా ఉండాలంటే వైద్యం, విద్య సంపూర్ణంగా అందించినప్పుడే సాధ్యమవుతుందని తరుచూ అనేవారు. దానికి తగినట్లుగానే ఆయన వైద్యానికి, విద్యకు తన ప్రభుత్వంలో అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. ఆరోగ్య శ్రీ పథకంలో అనేక రోగాలను చేర్చి రూ.25 లక్షల వరకూ వైద్య ఖర్చులకు రీ యింబర్స్‌మెంట్‌తో అవకాశం కల్పించారు. అసలు ఆరోగ్య శ్రీకి పెద్ద పీట వేసిన ఘనత గత ప్రభుత్వానిదే. గతంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ తరచూ ఇంటింటా ఫీవర్ (జ్వరం) సర్వే చేయించి ప్రజల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండేది.

జిల్లాలో 49 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 7 అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. వీటికితోడు హెల్త్ సెంటర్లు ఉండేవి. వాటిని హెల్త్ వెల్‌నెస్ సెంటర్లుగా మార్పు చేశారు. జిల్లాలో ఇప్పుడు 432 హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు ఉన్నాయి. గత ప్రభుత్వంలో ఈ సెంటర్లనే వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు అనేవారు. ఆ సెంటర్లకు కొన్నిచోట్ల సొంత భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. వాటిని తొందరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తెద్దామన్న ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు.

జగనన్న సురక్షతో ప్రజలకు రక్షిత వైద్యం

గత ప్రభుత్వంలో జగనన్న సురక్ష పథకం ద్వారా ఇంటింటికీ వైద్య సేవలు అందేవి. ఈ పథకం కింద తరుచూ గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల వైద్యానికి పెద్ద పీట వేసేవారు. ఈ పథకం ద్వారా గత ప్రభుత్వంలో జిల్లాలో రెండు వేలకు పైగా శిబిరాలు ఏర్పాటు చేసి దాదాపు రెండు లక్షల మంది ప్రజలకు వైద్యం సకాలంలో అదీ తమ సొంత గ్రామంలో లేదా ఇంటి వద్దే అందే ఏర్పాట్లు చేసింది.



గత ప్రభుత్వంలో ఇంటి వద్ద సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)



అమలాపురంలో నిర్మాణం పూర్తయి అందుబాటులోకి రాని రెండో అర్బన్ సెంటర్ భవనం



ఉప్పలగుప్తం మండలం వానపల్లిపాలెంలో అసంపూర్తి నిర్మాణంతో నిలిచిపోయిన వైఎస్సార్ క్లినిక్ భవనంలో పశువులను కట్టిన దృశ్యం

మందగమనంలో 108, 104 వైద్య సేవలు

జిల్లాలో 108 అంబులెన్స్‌లు 22 ఉన్నాయి. 104 వైద్య వాహనాలు 40కి పైగా ఉన్నాయి. గత ప్రభుత్వంలో వీటి ద్వారా వైద్య సేవలు అత్యంత వేగంగా అందేవి. ఇప్పుడు మందగమనంలో అంటే అంతంత మాత్రంగా అందుతున్నాయి. 108 అంబులెన్స్ వాహనాలు ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగితే క్షత గాత్రులను ఆస్పత్రులకు తక్షణమే తరలించేందుకు సకాలంలో రావడం లేదన్న ఆరోపణలు ఇటీవల కాలంలో ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. 108, 104 వాహనాల సిబ్బందికి రెండు నెలలు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి.

ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యుల కొరత

కోనసీమ అంతటికీ ప్రభుత్వ పరంగా పెద్దాసుపత్రి అమలాపురంలోని 100 పడకల ఏరియా ఆస్పత్రి. ఈ ఆస్పత్రిలో కీలకమైన గైనిక్, ఆర్థోపెడిక్ వైద్య విభాగాలకు వైద్యులే లేరు. ఆ పోస్టుల ఖాళీ కావడంతో గైనిక్ వైద్యపరంగా డిప్యూటేషన్‌పై ఓ వైద్యురాలిని వేరే ప్రాంతం నుంచి రప్పించి ఈ ఆస్పత్రిలో వారంలో మూడు రోజులు సేవలు అందించే ఏర్పాట్లు చేశారు. అమలాపురంలో గత ప్రభుత్వం వైద్య కళాశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఆ కళాశాలకు బోధనా ఆస్పత్రిగా ఈ ఏరియా ఆస్పత్రి మారనుంది. అంటే 100 పడకల నుంచి 650 పడకలకు అప్‌గ్రేడ్ కానుంది. దాదాపు 30 శాతం నిర్మాణ పూర్తయిన ప్రభుత్వ వైద్య కళాశాల పనులు కూటమి ప్రభుత్వంలో ముందుకు సాగక నిలిచిపోయాయి.



అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి

గత ప్రభుత్వంలో అర్బన్ హెల్త్ సెంటరు నిర్మించినా..

జిల్లా కేంద్రం అమలాపురంలో పట్టణంలో రెండో హెల్త్ సెంటరుకు సొంత భవనాన్ని 27వ వార్డులో దాదాపు రూ.కోటికి పైగా వ్యయంతో గత ప్రభుత్వం నిర్మించింది. ప్రస్తుతం అమలాపురం కచేరి చావిడి భవనంలో అరకొర వసతుల నడుమ రెండో అర్బన్ హెల్త్ సెంటర్ నడుస్తోంది. పూర్తి వసతులతో నిర్మించిన కొత్త భవనంలోకి ఈ సెంటర్‌ను తీసుకుని వెళ్లేందుకు కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది.

కొత్త భవనంలోకి మార్చాలని అడిగాను



అమలాపురంలో తన వార్డులో నిర్మించిన రెండో అర్బన్ హెల్త్ సెంటర్‌ను కొత్త భవనంలోకి మార్చాలని కౌన్సిల్ సమావేశాల్లోనే కాదు. ఆ శాఖ అధికారులను కూడా అనేక సార్లు అడిగాను. అధునాతన వసతులతో గత ప్రభుత్వంలోనే నిర్మించిన ఆ సువిశాల భవనానికి చిన్న చిన్న పనులు చేపట్టాల్సి ఉందన్న వంకతో ఆ భవనంలోని హెల్త్ సెంటర్‌ను మార్చడం లేదు. ఈ పనులు చేపట్టి తక్షణమే కొత్త భవనంలోకి సెంటర్‌ను మార్చాలి.

– బండారు గోవిందు, 27వ వార్డు కౌన్సిలర్, అమలాపురం మున్సిపాలిటీ

గతంలో వైద్య సేవలు వేగంగా అందేవి



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైద్య సేవలు వేగంగా అందేవి. ఆ సేవలకు జవాబుదారీ తనం ఉండేది. ఆరోగ్యశ్రీ పథకాన్ని కచ్చితంగా అమలు చేసేవారు. ఆరోగ్యశ్రీ పథకంలో అనేక రోగాలను అదనంగా చేర్చడమే కాకుండా రూ.25 లక్షల వరకూ వైద్య ఖర్చులు పెంచడంతో రోగమొచ్చినా ఆరోగ్యశ్రీతో ధీమాగా ఉండేవారు. ఇప్పుడు ఆ ధీమా కాస్తా భయంగా మారింది. ఇళ్ల వద్దకే వైద్య సేవలు గత ప్రభుత్వంలో అందేవి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి లేదు.

– జనుపల్లి ఏడుకొండలు, వక్కలంక గ్రామం, అంబాజీపేట మండలం

న్యూస్‌రీల్

అన్న ప్రసాద భవనానికి విరాళాలు



దాతలకు స్వామివారి చిత్రపటం అందచేస్తున్న డీసీ అండ్ ఈఓ చక్రధరరావు

కొత్తపేట: కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి క్షేత్రంలో వకుళమాత అన్న ప్రసాద భవన నిర్మాణానికి భక్తులు విరివిగా విరాళాలు సమర్పిస్తున్నారు. దానిలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన ఎస్ చైతన్యజనార్థన్, సిందూరి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.50,307, వీ వినోద్, సులోచనారాణి దంపతులు రూ 50,307 వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి విరాళంగా సమర్పించారు. దాతలకు దేవదాయ - ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటాలను అందజేశారు.

అయినవిల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు



అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామి

అయినవిల్లి: శ్రీవర సిద్ధి వినాయక స్వామి ఆలయానికి ఆదివారం భారీగా భక్తులు తరలి వచ్చారు. స్వామి వారి సన్నిధిలో భక్తులు లఘున్యాస అభిషేకాలు, ఉండ్రాళ్ల పూజ, శ్రీలక్ష్మీ గణపతి హోమం జరిపించుకున్నారు. అక్షరాభ్యాసం, అన్న ప్రాసన, తులాభారం, ఆశీర్వచనం పూజలు కూడా చేయించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామి వారికి రూ.3,77,996 ఆదాయం వచ్చిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్య అన్న ప్రసాదానికి రూ.1,95,295 విరాళాలుగా అందించారన్నారు.

తాగునీరు, వీధి దీపాలను బంద్ చేస్తాం

ఉధృతమవుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ సమ్మె



సమ్మె శిబిరంలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్లు

అమలాపురం టౌన్: రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు అమలాపురంలో చేపట్టిన మున్సిపల్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె కొనసాగుతోంది. అమలాపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమ్మె శిబిరం నుంచి సమ్మె చేస్తున్న 50 మంది వర్కర్లు మోకాళ్లపై నిలబడి ఆదివారం నిరసన తెలిపారు. తమ హక్కులు, డిమాండ్ల సాధన కోసం ఆదివారం నుంచి తమ సమ్మెను మరింత ఉధృతం చేస్తున్నామని మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎం.దుర్గా అర్జునరావు ప్రకటించారు. ఆదివారం నుంచి తాము విధులు నిర్వర్తించే తాగునీరు, వీధి దీపాలను కూడా బంద్ చేస్తూ నిరసన స్థాయిని పెంచుతున్నట్లు వివరించారు. ఉద్యోగ విరమణ వయస్సును 60 నుంచి 62కి పెంచాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, జీతాలను టెక్నికల్, నాన్ టెక్నికల్‌గా పెంచి ఇవ్వాలన్న డిమాండ్లతో వారు సమ్మె బాట పట్టారు. అమలాపురం యూనియన్ అధ్యక్షుడు దంగేటి షణ్ముఖరావు, ప్రధాన కార్యదర్శి యెరుబండి వెంకట సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు నాగారపు శ్రీనివాస్, యూనియన్ సభ్యులు నిరసనలో పాల్గొన్నారు.

రేపటి నుంచి సత్యసాయి రథోత్సవం



రథోత్సవం వివరాలు చెబుతున్న రాష్ట్ర సేవా సమితి ప్రతినిధి వర్ధనరావు

కొత్తపేట: భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి మహోత్సవాల సందర్భంగా సత్యసాయి ప్రేమ ప్రవాహిని (రథోత్సవం) ఈ నెల 3 డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ప్రవేశించి ఈ నెల 6వ తేదీ వరకూ కొనసాగుతుందని రాష్ట్ర సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధి, జిల్లా సేవాదళ్ కన్వీనర్ మన్యం పర్వతవర్ధనరావు తెలిపారు. రథోత్సవం నిర్వహణపై ఆదివారం స్థానిక సత్యసాయి సేవా మందిరంలో సేవా సమితి ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కన్వీనర్ కంకటాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వర్ధనరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ సత్యసాయి సేవా సంస్థలు 150 దేశాలలో విస్తరించి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

జిల్లాలో రథోత్సవం ఇలా..

మంగళవారం ఉదయం యానాంలో రథోత్సవం ప్రారంభమై ఎదుర్లంక బాలయోగి వారధి మీదుగా మురమళ్ల, ముమ్మిడివరం, అమలాపురం, బండార్లంక, పి.గన్నవరం, డొక్కా సీతమ్మ అక్విడెక్ట్ మీదుగా సాయంత్రానికి వాడ్రేవుపల్లి చేరుకుంటుంది. 4న ఉదయం అక్కడ బయలుదేరి పెదపట్నం అగ్రహారం, మామిడికుదురు, మగటపల్లి, గోగన్నమఠం, శంకరగుప్తం, అంతర్వేది, సఖినేటిపల్లి, మల్కిపురం, రాజోలు, జగ్గన్నపేట మీదుగా సాయంత్రానికి లక్కవరం చేరుకుంటుంది. 5వ తేదీ ఉదయం కొత్తపేట మండలం గొలకోటివారిపాలెం నుంచి కొత్తపేట, రావులపాలెం, ఊబలంక, ఆలమూరు మీదుగా సాయంత్రానికి మండపేట చేరుకుంటుంది. 6న వల్లూరు వెదురుమూడి, అంగర, పామర్రు, ద్రాక్షారామం, చెల్లూరు, పసలపూడి, రామచంద్రపురం మీదుగా కేశవరంతో జిల్లాలో రథోత్సవం ముగుస్తుంది. సమావేశంలో సేవా సమితి సభ్యులు చొప్పెల్ల రాంబాబు, సత్యవరపు భాస్కరరావు పాల్గొన్నారు.

నేడు జూనియర్ కళాశాలల పునః ప్రారంభం

అమలాపురం టౌన్: వేసవి సెలవుల అనంతరం జిల్లాలోని ఇంటర్మీడియెట్ జూనియర్ కళాశాలలు సోమవారం పునః ప్రారంభమవుతున్నాయని డీఐఈవో వనము సోమశేఖరరావు తెలిపారు. ఏప్రిల్ 24 నుంచి జూన్ 1వ తేదీ వరకూ కళాశాలలకు వేసవి సెలవులు ఇచ్చారని చెప్పారు. గతంలో ఇంటర్మీడియెట్ విద్యా సంవత్సరం జూన్ 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యేదని ఆయన గుర్తు చేశారు. ఈ ఏడాది జూనియర్ కళాశాలలు ఏప్రిల్ 1 నుంచే ప్రారంభయ్యాయని తెలిపారు. ఏప్రిల్ 7 నుంచి మొదటి సంవత్సరం విద్యార్థులకు అడ్మిషన్లు కూడా ప్రారంభమయ్యాయని చెప్పారు. అదే రోజు నుంచి బోధనా తరగతులు కూడా ప్రారంభమై ఏప్రిల్ 23 వరకూ జరిగాయన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు కొంత సిలబస్‌ను 'బ్రిడ్జి కోర్సు' పేరుతో బోధించారని పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు కూడా కొన్ని ప్రత్యేక పాఠ్యాంశాలను బోధించారని డీఐఈవో సోమశేఖరరావు తెలిపారు.

కూటమి పాలనను ఎండగట్టండి

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి పిలుపు
- 4న వెన్నుపోటు దినం పోస్టర్ల ఆవిష్కరణ

అమలాపురం రూరల్: సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసగించిన కూటమి ప్రభుత్వ పాలనను ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు వైఎస్సార్ సీపీ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జూన్ 4వ తేదీన తలపెట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. అమలాపురం మండలం భట్నవిల్లిలో మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ నివాసం వద్ద వెన్నుపోటు దినం పోస్టర్లను జగ్గిరెడ్డి, అమలాపురం నియోజకవర్గం కోఆర్డినేటర్ పినిపే డాక్టర్ శ్రీకాంత్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఆదివారం ఆవిష్కరించారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ కోనసీమలోని ఏడు నియోజకవర్గాల్లో కోఆర్డినేటర్ల అధ్వర్యంలో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అమలాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే డాక్టర్ శ్రీకాంత్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని నియోజకవర్గంలో ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, ఎంపీపీలు కుడుపూడి భాగ్యలక్ష్మి, యిళ్ల శేషారావు, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, మున్సిపల్ చైర్మన్ రెడ్డి నాగేంద్రమణి, బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, మండల పార్టీ అధ్యక్షుడు గుత్తుల చిరంజీవిరావు, కొనుకు బాపూజీ, బద్రి బాబ్జి, సర్పంచ్ చెల్లి బోయిన వెంకటేశ్వరరావు, నాయకులు కుడుపూడి భరత భూషణ్, మార్గాన గంగాధర్, గొల్లపల్లి డేవిడ్, వంటెద్దు వెంకన్నాయుడు, కేత భానుతేజ, మోటూరి సత్యం కాపు, కొల్లాటి దుర్గాబాయి పాల్గొన్నారు.



వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, డాక్టర్ శ్రీకాంత్ తదితరులు

అన్ని రంగాల అభివృద్ధి లక్ష్యం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వీర్రాజు

కొత్తపేట: అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతోందని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. కొత్తపేటలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చుకునే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఏపీని ప్రగతిశీల రాష్ట్రంగా నిలిపేందుకు సహకరిస్తుందన్నారు. రూ.3 వేల కోట్లతో గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, అమలాపురం నుంచి కాకినాడ 4 లైన్ల హైవే, జొన్నాడ హైవే నుంచి యానాం హైవే వరకూ రూ.200 కోట్లతో ఏటిగట్టు రోడ్డు విస్తరణ, కోనసీమ అభివృద్ధి, ఇక్కడ టూరిజం అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించినట్టు తెలిపారు. కృష్ణా, కడప, తూర్పుగోదావరి జిల్లాల్లో టూరిజం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.200 కోట్లు మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం ఇసుక అక్రమ నిల్వలు, రవాణాపై అడిగిన ప్రశ్నకు సమాధానంగా రేపు వచ్చే వరదలను దృష్టిలో పెట్టుకుని నిల్వలు పెడతున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వంలో కూడా వరదలను దృష్టిలో పెట్టుకునే నిల్వలు పెడితే చంద్రబాబు, కూటమి నాయకులు గుట్టల వద్ద ఫొటోలు తీయించుకుని విమర్శలు చేశారు? అన్న ప్రశ్నకు అప్పటి కంటే ఇప్పుడు తక్కువ ధరకు ఇసుక సరఫరా చేస్తున్నట్టు సమర్థించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే ఎంఏ వేమా, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం పాల్గొన్నారు.

పడిగాపులు మొదలు



ఉప్పలగుప్తంలో రేషన్ దుకాణం వద్ద పడిగాపులు కాస్తున్న లబ్ధదారులు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి దూర ప్రాంత ప్రజలు, మహిళలు, వృద్ధులు ఇబ్బంది పడకుండా రేషన్ బియ్యాన్ని ఎండీయూ వాహనాలతో ఇంటింటికీ అందించే ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వంలో ఎండీయూ వాహనాలను రద్దు చేసి, రేషన్ దుకాణం వద్దే బియ్యం, సరకులు అందించే విధంగా ఆదివారం నుంచి చర్యలు చేపట్టడంతో ప్రజలు రేషన్ దుకాణం వద్ద పడిగాపులు కాస్తూ తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

– ఉప్పలగుప్తం/కాట్రేనికోన



కాట్రేనికోనలో బియ్యాన్ని తీసుకెళుతూ తిప్పలు పడుతున్న వృద్ధులు

సీపీవో సేవలు అభినందనీయం

అమలాపురం రూరల్: జిల్లా ప్రణాళికాధికారి పి.వెంకటేశ్వర్లు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో 40 ఏళ్లపాటు వివిధ బాధ్యతలు నిర్వహించి విశిష్ట సేవలు అందించారని అధికారులు ప్రశంసించారు. ఆయన పదవీ విరమణ సందర్భంగా అమలాపురంలోని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం ఆయనకు ఉద్యోగులు వీడ్కోలు సభ నిర్వహించారు. ప్రణాళికా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మురళి, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి రామకృష్ణారెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ కృష్ణారెడ్డి, జిల్లా పశుసంవర్ధక అధికారి వెంకట్రావు మాట్లాడుతూ ప్రణాళికా అమలు, గణాంక విశ్లేషణ, అభివృద్ధి కార్యక్రమాల సమన్వయంలో విశేష దక్షత చూపారని అన్నారు. 2022లో నూతనంగా ఏర్పడిన అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు గుంటూరు నుంచి బదిలీపై వచ్చిన వెంకటేశ్వర్లు, జిల్లా ప్రణాళికాధికారిగా అమలాపురంలో విశిష్ట సేవలు అందించారని అన్నారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కోనసీమ జిల్లాకు బదిలీ అయిన తరువాత కొత్తగా ఏర్పడిన జిల్లా కార్యాలయ వ్యవస్థను పునాది నుంచి ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ప్రారంభంలో తాను నివసిస్తున్న ఇంట్లోనే కార్యాలయం ప్రారంభించి, తర్వాత కార్యాలయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వెంకటేశ్వర్లు దంపతులతోపాటు పదవీ విరమణ పొందిన డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ ఆర్.శంకర్‌రావును కూడా సత్కరించారు.



వెంకటేశ్వర్లు దంపతులను సత్కరిస్తున్న అధికారులు

క్లుప్తంగా

జాతీయ యోగా పోటీలకు ముగ్గురి ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైనవారిని అభినందిస్తున్న యోగా గురువు డాక్టర్ శ్రీనివాస్

అమలాపురం టౌన్: శ్రీ స్వామి వివేకానంద యోగాశ్రమంలో శిక్షణ పొందుతున్న ముగ్గురు బాల బాలికలు జాతీయ పోటీలకు ఎంపిక య్యారు. గత ఏప్రిల్ 8న వైజాగ్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ఈ ముగ్గురి బాల బాలికలు జాతీయ పోటీలకు అర్హత సాధించారని ఆ యోగాశ్రమం యోగా గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ తెలిపారు. జూనియర్ కేటగిరీలో వెయిట్ విభాగంలో బంగారు మేఘన, చామకూరి వర్ధిని, గుత్తల ప్రవీణ్ ఎంపికైనట్లు చెప్పారు. వీరు ఈ నెల 12న ఢిల్లీలో జరగనున్న జాతీయ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత, జాతీయ యోగా న్యాయ నిర్ణేత మోటూరి భైరవస్వామి ఎంపికైన ముగ్గురిని యోగా శిక్షకులను అభినందించారు.

విలేకరి రాముపై దాడిని ఖండించిన వైఎస్సార్ సీపీ నేతలు

పరామర్శించిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, జగ్గిరెడ్డి, డాక్టర్ శ్రీకాంత్



సాక్షి విలేకరి రామును పరామర్శిస్తున్న ఇజ్రాయిల్, జగ్గిరెడ్డి, డాక్టర్ శ్రీకాంత్, పార్టీ నాయకులు

అమలాపురం టౌన్: అయినవిల్లి మండల సాక్షి విలేకరి భావిశెట్టి రామకృష్ణ నాగేశ్వరరావు (రాము)పై జరిగిన దాడిని జిల్లా వైఎస్సార్ సీపీ నేతలు ఖండించారు. అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామును పార్టీ జిల్లా నేతలు ఆదివారం పరామర్శించారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, అమలాపురం నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ రామును పరామర్శించారు. రాముపై జరిగిన దాడి వివరాలపై వారు ఆరా తీశారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ నాయకులు గొల్లపల్లి డేవిడ్ రాజు, కుడుపూడి భరత్ భూషణ్ రామును పరామర్శించారు.

వివాహిత అదృశ్యం

అమలాపురం టౌన్: గత నెల 30వ తేదీన తన భార్య చర్చికి వెళతానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదని ఆమె భర్త అమలాపురం రూరల్ మండలం రోళ్లపాలేనికి చెందిన ఉండ్రాజవరపు జగదీష్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. జగదీష్, నందినికి మూడేళ్ల కిందట వివాహమైంది. వారికి ఇంకా సంతానం లేదు. రెండు రోజులుగా భార్య ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో భర్త జగదీష్ ఫిర్యాదు చేశాడు.

స్ఫూర్తినిచ్చి.. ఆర్తి మిగిల్చి..

- విద్యావేత్త చిరంజీవిని కుమారి అస్తమయం
- ప్రజల సందర్శనార్థం నేడు ఇంద్రపాలెం ఐడియల్ కళాశాలలో పార్థివ దేహం



డాక్టర్ చిరంజీవినీ కుమారి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): గోదావరి జిల్లాల్లో ప్రఖ్యాత విద్యాసంస్థలు ఐడియల్ విద్యాసంస్థల అధినేత, ప్రముఖ సాహితీవేత్త, తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకు, స్త్రీ హక్కుల పరిరక్షణకు అలుపెరుగని పోరాటం చేసిన డాక్టర్ పి.చిరంజీవిని కుమారి (94) ఆదివారం తుది శ్వాస విడిచారు. ఆమె భర్త పీఎస్ శర్మ పదేళ్ల క్రితం మృతిచెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు, పెద్ద కుమారుడు గోపాల్ వైద్యవృత్తిలో కొనసాగుతుండగా, చిన్నకుమార్ కిరణ్ ఐడియల్ కళాశాల అడ్మినిస్ట్రేటర్‌గా ఉన్నారు. పూర్వ విద్యార్థులు, సాహితీ ప్రియులు, అభిమానుల సందర్శనార్థం ఆమె భౌతిక కాయాన్ని ఇంద్రపాలెం ఐడియల్ డిగ్రీ కళాశాలలో సోమవారం ఉదయం 11 గంటల వరకూ ఉంచనున్నారు. 1931 మార్చి 30వ తేదీన జన్మించిన డాక్టర్ చిరంజీవిని కుమారి కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ఆంగ్ల అధ్యాపకురాలిగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించి కొద్దికాలం సేవలందించి, డాక్టర్ పి.వి.ఎస్.రాజుతో కలిసి 1970లో ఐడియల్ జూనియర్ కళాశాలతో ఐడియల్ విద్యాసంస్థను ప్రారంభించారు. క్రమేణా డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు స్థాపించి లక్షలాది మంది విద్యార్థులను తయారు చేశారు. ఒకపక్క విద్యాసంస్థల నిర్వహణతో పాటు తూర్పుగోదావరి రచయితల సంఘం కార్యదర్శిగా జిల్లాలో భాషా సాహిత్యాభివృద్ధికి చాలా కృషిచేశారు. ఐడియల్ విద్యాసంస్థల్లో తెలుగు భాషను మాత్రమే ద్వితీయ భాషగా కొనసాగిస్తూ, తెలుగు భాషా సంస్కృతి వికాసానికి ఎనలేని సేవలు అందించారు. మహాకవి శ్రీ శ్రీ సప్తతి, వెయ్యేళ్ల తెలుగు సాహిత్య వేడుకలు, పద్మశ్రీ డాక్టర్ గరికిపాటి నరసింహారావు మొదటి సహస్రావధానం మొదలైన కార్యక్రమాలు ఐడియల్ విద్యాసంస్థల ద్వారా జరిపించారు. తూర్పుగోదావరి జిల్లా చరిత్ర, సంస్కృతి, జిల్లా సాహిత్య చరిత్ర గ్రంథాల రచనకు సారథ్యంతో పాటు జన విజ్ఞాన వేదికకు సేవలందించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ పాలక మండలి సభ్యురాలిగా సేవలందించి గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేశారు. స్వాతంత్య్ర సంగ్రామంలో తూర్పుగోదావరి అనే గ్రంథాన్ని రచించి ప్రశంసలు పొందారు. ఏయూ నుంచి స్వర్ణ పతాక అవార్డు పొందారు.

డాక్టర్ శిఖామణి సంతాపం

యానాం: ప్రముఖ విద్యావేత్త, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు, ఐడియల్ కాలేజీ కరస్పాండెంట్, అభ్యుదయ రచయిత్రి డాక్టర్ పి.చిరంజీవినికుమారి మృతిపట్ల యానాం కవిసంధ్య సంపాదకుడు, విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ శిఖామణి ఆదివారం ప్రకటనలో తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. పీఆర్ కాలేజీలో డిగ్రీ చదివే రోజుల నుండి కవిసంధ్య పత్రిక వరకు ఆమె అందించిన ప్రోత్సాహం మరువలేనిదన్నారు. వయోభారాన్ని సైతం పక్కనపెట్టి గత సంవత్సరం కథా సదస్సు నిర్వహించడం, గత నెలలో యానాంలో కవిసంధ్య నిర్వహించిన దాట్ల అభినందన సభలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్న విషయాన్ని గుర్తుచేశారు. ఆయన మృతి అటు జిల్లా విద్యారంగానికి, సాహిత్యరంగాలకు తీరని లోటు అని పేర్కొన్నారు.

జిల్లా క్రీడారంగానికి తీరని లోటు

ఒలింపిక్ సంఘ కార్యదర్శి ఎలీషాబాబు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో సుమారు 25 సంవత్సరాల పాటు జిల్లా ఒలింపిక్ సంఘానికి వివిధ హోదాల్లో సేవలు అందించిన, ఐడియల్ విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవిని కుమారి మృతి జిల్లా క్రీడారంగానికి తీరని లోటని జిల్లా ఒలింపిక్ సంఘ కార్యదర్శి డాక్టర్ జి.ఎలీషాబాబు పేర్కొన్నారు. డాక్టర్ చిరంజీవినీ కుమారి ఒలింపిక్ సంఘానికి గౌరవ అధ్యక్షురాలిగా, ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా సేవలు అందించారన్నారు. అన్ని క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ ఆర్థికంగా వివిధ క్రీడాపోటీల నిర్వహణకు, ఒలింపిక్ సంఘానికి చేయూతనిచ్చారని తెలిపారు. రాజమహేంద్రవరం నన్నయ యూనివర్శిటీ ఏర్పాటులో కూడా గోదావరి సాధన సమితి ద్వారా ఆమె చేసిన కృషి ఎంతో ఉందన్నారు. ఒలింపిక్ రన్ కన్వీనర్‌గా మినీ ఒలింపియాడ్, ఒలింపిక్ రన్ నిర్వహణలో చాలాకాలం ఆమె సర్టిఫికెట్లు అందించారన్నారు. వాలీబాల్ సంఘానికి కూడా ఆమె సేవలు అందించారని తెలిపారు. ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, గౌరవ అధ్యక్షుడు చుండ్రు గోవిందరాజు, కర్రిభామిరెడ్డి, డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్, రెడ్‌క్రాస్ రాష్ట్ర అధ్యక్షుడు వైడీ రామారావు, రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘ మాజీ అధ్యక్షుడు ఎల్.జార్జి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ మాజీ అధ్యక్షుడు రవిరాజు, ప్రస్తుత అధ్యక్షుడు శ్రీను, మాచరరావు చిరంజీవినీ కుమారి మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించారు.

గొప్ప సాహితీవేత్తను కోల్పోయాం



విద్య, సామాజిక, సాహితీవేత్తగా పేరొంది ఎంతో మందికి ఆదర్శంగా నిలిచిన డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి మృతి సమాజానికి తీరని లోటు. జిల్లా చరిత్రను గ్రంథస్తం చేసిన ఆమె ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు. ఆమె కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

– చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ మంత్రి

సామాజ ఉన్నతికి పాటుపడిన గొప్ప విద్యావేత్త



ఎంతోమంది విద్యార్థులను ఐడియ కళాశాల ద్వారా చిరంజీవిని కుమారి ఉన్నతులుగా తీర్చిదిద్ది సమాజానికి మంచి పౌరులను అందించారు. ఇంటర్, డిగ్రీతోపాటు ఇంజినీరింగ్ విద్యను కూడా అందించాలనే సంకల్పంతో ఇంజినీరింగ్ కళాశాలను కూడా ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఆమె మరణం సాహితీ వేత్తలకు, రచయితలకు తీరని లోటు.

– డాక్టర్ పి.కృష్ణారావు, ప్రగతి కళాశాల చైర్మన్

భక్తులతో పోటెత్తిన రత్నగిరి



రథంపై ఆలయ ప్రాకారంలో సత్యదేవుడు, అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. రత్నగిరిపై శనివారం రాత్రి పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. అదే ముహూర్తాలలో రాష్ట్రంలోని పలుచోట్ల కూడా వివాహాలు జరగడంతో నవదంపతులు వారి బంధు మిత్రులు ఆదివారం సత్యదేవుని ఆలయానికి విచ్చేశారు. వీరికి ఇతర భక్తులు కూడా తోడవడంతో ఆలయంలో తీవ్ర రద్దీ నెలకొంది. వీరంతా స్వామివారి వ్రతాలాచరించి దర్శనం చేసుకున్నారు. సత్యదేవుని దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అర గంట పట్టింది. సత్యదేవుడిని దర్శించిన అనంతరం భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి రావి చెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. ఆదివారం స్వామి వారిని 30 వేల మంది దర్శించగా, వ్రతాలు రెండు వేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు ఐదువేల మంది భక్తులకు సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో ఉచిత భోజన సౌకర్యం కలుగ చేశారు.

ఘనంగా రథసేవ

ఆలయ ప్రాకారంలో ఆదివారం ఉదయం సత్యదేవుని రథసేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చి రథం మీద ప్రతిష్ఠించారు. స్వామి, అమ్మవార్లకు పూజలు చేసినఅనంతరం అర్చకస్వాములు సుధీర్, గణేష్ ప్రాకారసేవ ప్రారంభించారు. వేదపండితుల మంత్రోచ్చాటన మధ్య, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాకారంలో సేవ నిర్వహించారు. సేవ అనంతరం పండితులు స్వామి, అమ్మవార్లకు నీరాజనం ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

బైక్‌ను తీసుకుపోయిన ముగ్గురిపై కేసు

అమలాపురం టౌన్: మండలంలోని ఈదరపల్లి శివారు ఆర్ఆర్ నగర్‌లో మోటార్ సైకిల్ మెకానిక్ షెడ్డు నుంచి వేరే వ్యక్తికి చెందిన మోటారు సైకిల్‌ను దౌర్జన్యంగా తీసుకుని వెళ్లారన్న నేరంపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. బైక్‌ను తీసుకుని వెళ్లిన పి.గన్నవరం మండలం కె.ముంజవరానికి చెందిన అడబాల నానితోపాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. నాని ఆరు నెలల కిందట తన ఎన్‌ఫీల్డ్ (బుల్లెట్) మోటారు సైకిల్‌ను మెకానిక్ షేక్ మాబేర్ బాషాకు బాగు చేయడానికి ఇచ్చాడు. తన మోటారు సైకిల్ రిపేరు చేసి ఇవ్వడం లేదన్న కోపంతో అదే షెడ్డులో ఉన్న వేరే వ్యక్తికి చెందిన మోటారు సైకిల్‌ను దౌర్జన్యంగా నానితో పాటు మరో ఇద్దరి వ్యక్తులు తీసుకుని వెళ్లిపోయారు. మెకానిక్ షేక్ మాబేర్ బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరబాబు తెలిపారు.

మంత్రికి ప్రొటోకాల్‌తో పనిలేదా?



జనసేన ఎంపీటీసీతో కలసి ఉదయాన్నే రేషన్ షాపును ప్రారంభించిన సర్పంచ్ సతీష్‌కుమారి



అదే రేషన్ షాపునకు మధ్యాహ్నం రిబ్బన్ కత్తిరించి డీలర్, ఎంపీటీసీ సభ్యులతో ఫొటో దిగిన మంత్రి సుభాష్

వైఎస్సార్ సీపీ రామచంద్రపురం నియోజకవర్గ అధ్యక్షురాలు సతీష్‌కుమారి

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు ప్రొటోకాల్‌తో పని లేదా.. అని వైఎస్సార్ సీపీ రామచంద్రపురం నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు, వెంకటాయపాలెం సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి ప్రశ్నించారు. వెంకటాయపాలెంలో ఆదివారం జరిగిన రేషన్ డిపోల ప్రారంభోత్సవాల నేపథ్యంలో జరిగిన ఘటనలను ఆమె ఆదివారం విలేకరులకు వివరించారు. ఏదో కొత్త వ్యవస్థను తమ ప్రభుత్వంలో నూతనంగా ప్రారంభిస్తున్నట్లు ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం హడావుడి చేసిందన్నారు. ఈ నేపథ్యంలో తమ గ్రామంలో రెండు రేషన్ షాపులు ఉండగా 51వ రేషన్ షాపును తాను, గ్రామంలోని జనసేన పార్టీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు కణితి వెంకటేశ్వరి, ఇతర గ్రామ పెద్దలతో కలసి ఉదయం 8.30 గంటలకు ప్రారంభించినట్లు తెలిపారు. ఆ తరువాత 52వ షాపు వద్దకు వెళ్లగా ఎంపీటీసీ సభ్యురాలు స్థానిక కూటమి నాయకులతో కలసి రిబ్బన్ కత్తిరించి అప్పటికే ప్రారంభించడంతో.. మీరు చేసింది సరైన విధానం కాదని డీలర్‌తో చెప్పి అక్కడి నుంచి వచ్చేసి తహసీల్దార్‌కి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఉదయం ఈ రెండు షాపులూ ప్రారంభించేసినా మంత్రి సుభాష్‌ను కూటమి నాయకులు మధ్యాహ్నం పిలిపించి మళ్లీ వాటికి రిబ్బన్ కత్తిరింపజేయడం గ్రామంలో చర్చనీయాంశం అయ్యిందన్నారు. కూటమి నాయకులు మంత్రిని అవమానించినట్లు భావించాలో, మంత్రి వచ్చిన తరువాత పిలవకపోవడం సర్పంచ్‌గా నన్ను అవమానించినట్లు భావించాలో అర్థం కావడంలేదన్నారు. ఏది ఏమైనా మంత్రి సుభాష్ ప్రొటోకాల్‌కి ప్రాధాన్యం ఇవ్వడం లేదన్న విషయం ఈ ఘటనతో తేటతెల్లం అయ్యిందని ఆమె మండిపడ్డారు.

ఇద్దరు సీఆర్వో ఆఫీసు గుమస్తాల సస్పెన్షన్



సీఆర్వో కార్యాలయం వద్ద శనివారం అర్ధరాత్రి ఆందోళన చేస్తున్న భక్తులు

అన్నవరం: సత్యదేవుని దర్శనానికి విచ్చేసిన భక్తులకు వసతి గదులు ఖాళీ ఉండి కూడా అద్దెకు ఇవ్వకుండా భక్తుల్ని ఇబ్బంది పెట్టారన్న అభియోగంపై సీఆర్వో కార్యాలయంలో కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న గుమస్తాలు కె. శ్రీనివాస్, కలికేశ్వరరావును సస్పెండ్ చేస్తూ ఈఓ వీర్ల సుబ్బారావు ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. శనివారం అర్ధరాత్రి కొంతమంది భక్తులు వసతి గదుల కోసం సీఆర్వో కార్యాలయం వద్ద వాకబు చేయగా గదులు ఖాళీ లేవని అక్కడ సిబ్బంది తెలిపారు. దీంతో వారు డిస్‌ప్లే బోర్డులో గదులు ఖాళీ ఉన్నాయని చూపిస్తుంటే మీరు గదులు ఖాళీ లేవంటున్నారేంటని ప్రశ్నించారు. దీంతో బాటు సీఆర్వో కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. కొంతమంది భక్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన ఈఓకు ఫోన్ చేసి విషయం చెప్పారు. దాంతో ఈఓ వెంటనే సీఆర్వో కార్యాలయానికి వెళ్లి తనిఖీలు నిర్వహించగా 60 గదులు ఖాళీ ఉన్నట్టు తేలింది. దాంతో ఆ గదులను ఆ భక్తులకు అద్దెకి ఇప్పించారు. భక్తుల్ని ఇబ్బంది పెట్టినందుకు కౌంటర్‌లో ఉన్న ఇద్దరినీ సస్పెండ్ చేశారు.

వినాయకుడి ఆలయంలో హుండీ చోరీ

కడియం: స్థానిక పోస్టాఫీసు వీధిలోని పెద్ద వినాయకుడి ఆలయం వద్ద హుండీని పగలగొట్టి అందులోని నగదును దొంగలు ఎత్తుకుపోయారు. ఉదయం పూజలు చేసేందుకు వచ్చిన అర్చకులు డిబ్బీ తాళం పగలగొట్టి ఉండడాన్ని గుర్తించి స్థానికులకు సమాచారం ఇవ్వగా, వారు పోలీస్‌లకు తెలియజేశారు. క్రైం అడిషనల్ ఎస్పీ అర్జున్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ.వేంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ దుర్గాప్రసాద్, సిబ్బంది గంగాధర్, ప్రసాద్, రవి, కుమార్ దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం ఆధారాలు సేకరిస్తోంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కడియం: మండలంలోని దుళ్ళ – చొప్పెల్ల రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుళ్ళ గ్రామానికి చెందిన కాలెపు వీరవెంకటేశ్వరరావు (43) మృతి చెందాడు. రైస్‌మిల్లులో అక్కౌంటెంట్‌గా పనిచేస్తున్న వీరవేంకటేశ్వరరావు ఆలమూరు మండలం చొప్పెల్లలో జరుగుతున్న జాతరకు వెళ్లేందుకు బండిపై శనివారం బయలుదేరాడు. దుళ్ళ శివార్లలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న మరో మోటారు సైకిల్ ఇతడి మోటారు సైకిల్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలైన వీరవేంకటేశ్వరరావు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూశాడు. వేంకటేశ్వరరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబానికి ఇతడే ప్రధాన ఆధారం. తమకు అండగా ఉంటాడనుకున్న వ్యక్తి ఇలా హఠాత్తుగా కన్నుమూయడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇదిలా ఉండగా మరో మోటారు సైకిల్‌పై ఉన్న యువకుడికి కూడా గాయాల పాలయ్యాడని, అతడిని కూడా ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

రైలు ఢీకొని..

తుని: స్థానిక జీఆర్పీ పోలీస్ స్టేషన్ పరిధిలోని రావికంపాడు– పిఠాపురం మధ్యలో రైలు ఢీకొని గుర్తు తెలియని (35) వ్యక్తి మృతి చెందాడని ఎస్సై జి.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న గుర్తు తెలియని రైలు ఢీకొని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి ఒంటిపై పింక్ రంగు ఆఫ్ చేతుల షర్ట్, నీలం రంగు జీన్ ఫ్యాంట్ ఉన్నాయి. కుడి చేతి మోచేయిపై మామ్ అండ్ డ్యాడీ అని ఇంగ్లిషులో పచ్చబొట్టు కలిగి ఉన్నాడన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు.

కోడిపందేలాడుతున్న 10 మంది అరెస్టు

కోరుకొండ: మండలంలోని నిడిగట్లగ్రామ శివారులో కోడిపందేలాడుతున్న 10 మందిని ఆదివారం కోరుకొండ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై కూన నాగరాజు సిబ్బందితో పాటు దాడి చేసి నిందితుల వద్ద నుంచి రూ.6,240 నగదు, రెండుకోళ్లు, రెండు కోడికత్తులను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

ఉత్సాహంగా ఓపెన్ చదరంగం పోటీలు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం) : జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పెయింటర్స్ అసోసియేషన్ హాలులో జిల్లా ఓపెన్ చదరంగం పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో సుమారు 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఆరు రౌండ్లుగా జరిగిన ఈ పోటీల్లో వి.సుజన్ కుమార్, సీహెచ్ గీతేష్, కె.శ్రీ ఇషాంత్, వి.జశ్వంత్ విజయం సాధించారు. విజేతలు ఈ నెల 7న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఓపెన్ మెన్ విభాగంలో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు.

వాడపల్లిలో భక్తజన సందోహం




వాడపల్లి ఆలయంలో అష్టోత్తర పూజలో పాల్గొన్న భక్తులు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి క్షేత్రం నిత్య కళ్యాణం పచ్చతోరణంలా తిరుమల క్షేత్రాన్ని తలపిస్తోంది. »ఏడు శనివారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్య ఫలం« నానుడితో అశేష భక్తజనం తరలిరావడంతో కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన విషయం తెలిసిందే. శనివారం రాష్ట్ర నలుమూలల నుంచి అశేష సంఖ్యలో భక్తులు తరలివస్తుండగా మిగిలిన ఆరు రోజులు కూడా భక్తజనం తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. వారితో పాటు ఏడు వారాల నోము పూర్తి చేసుకున్న భక్తులు అష్టోత్తర పూజలు జరిపిస్తున్నారు. ఆదివారం వాడపల్లి క్షేత్రానికి భక్తులు తరలివచ్చి అష్టోత్తర పూజలో పాల్గొని, స్వామిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

దేవదాయ – ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఒక్కరోజు దేవస్థానానికి రూ 8,06,929 ఆదాయం వచ్చినట్టు డీసీ అండ్ ఈఓ చక్రధరరావు తెలిపారు.

ఖరీఫ్‌కు నీరు విడుదల



తూర్పు డెల్టా నుంచి విడుదలవుతున్న సాగునీరు



తూర్పు డెల్టా కాలువకు నీటిని విడుదల చేస్తున్న ప్రాజెక్టు కమిటీ చైర్మన్ సునీల్‌కుమార్, ఈస్టర్న్ డివిజన్ డెల్టా ఈఈ రామకృష్ణ

ధవళేశ్వరం: ఖరీఫ్ సాగుకు సంబంధించి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం నీటిని విడుదల చేశారు. ఈస్టర్న్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఎం.సునీల్‌కుమార్, ఈస్టర్న్ డివిజన్ ఈఈ వివి రామకృష్ణ గేట్ల స్విచ్ ఆన్ చేసి నీటిని వదిలారు. తొలుత తూర్పు డివిజన్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఎం.సునీల్ కుమార్, ఈస్టర్న్ డివిజన్ ఈఈ వీవీ రామకృష్ణ గోదావరి మాతకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ రైతులు సకాలంలో నాట్లు వేసుకోవాలని సూచించారు. ఈఈ రామకృష్ణ మాట్లాడుతూ ఖరీఫ్ త్వరగా ప్రారంభించడం ద్వారా ప్రకృతి విపత్తులు, తుపానులు, వరదల ముంపు బారిన పంటలు పడకుండా రైతు చేతికి అందుతాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని జూన్ 1న డెల్టా కాలువలకు నీటిని విడుదల చేశామన్నారు. గోదావరి డెల్టాకు సంబంధించి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాల పరిధిలో 10,13,161 ఎకరాలకు నీటిని కాటన్ బ్యారేజీ ద్వారా అందిస్తున్నామన్నారు. ఖరీఫ్‌ని సకాలంలో పూర్తి చేయడం ద్వారా రబీ త్వరగా ప్రారంభించడానికి అవకాశం ఉంటుందని తద్వారా రబీలో కూడా నీటి ఎద్దడి లేకుండా సాగుకు నీరు అందుతుందన్నారు. 6.1కోట్లతో చేపట్టిన పనులు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. డెల్టా కాలువలకు మొత్తం 500క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద 10.25 అడుగుల వద్ద నీటిమట్టం నెలకొంది. బ్యారేజీ నుంచి ఆదివారం సాయంత్రం 10,707 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ సర్కిల్ ఇన్‌చార్జి ఎస్ఈ బి వెంకటస్వామి, ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ డీసీ సుబ్బారెడ్డి, ఇరిగేషన్ అధికారులు డీఈలు ఆనంద్‌బాబు, రమేష్, ఏఈలు అద్దంకి సాయిరామ్, డి.రాధాకృష్ణ పాల్గొన్నారు.